బాలబారతి, పుట : 35-37, జి. రామలక్ష్మి- హైదరాబాదు

## పరిష్కారం

పెద్ద సంసారం గోవిందుడిది. అయినా ప్రతి రోజూ ఏదో సమస్య. తండ్రికి పక్షవాతం, తల్లికి కీళ్ళవాతం, భార్యకి అంతుపట్టని దీర్ఘవ్యాది, కూతురికి చెముడు, కొడుక్కి జలుబు, దగ్గు, నీళ్ళు లాగా డబ్బు ఖర్చుపెట్టినా ఏ ఒక్కరి వ్యాది తగ్గలేదు సరికదా రోజు రోజుకీ తీవ్రం అయినాయి.

ఇంటికి వస్తే చాలు ప్రతి ఒక్కరూ తమ వ్యాధుల్ని గురించి చెప్పేవారు. చివరకు గోవిందుడికి కూడా ఉబ్బసం వ్యాధి పట్టుకుంది.

ఈ రోగాలతో, కష్టాలతో బాగా విసిగివేసారిపోయాడు. 'సన్యాసి సుఖీ, సంసారి దుఃఖీ' అనుకుంటూ జై బ్రహ్మదేవా అంటూ సన్యాసం పుచ్చుకుని పక్కనే వున్న ఓ అడవిలో చెట్టుక్రింద కూర్చుని తపస్సు ప్రారంభించాడు. ఇలా ఎంతకాలం తపస్సు చెయ్యాలో అనుకుంటూ ముచ్చటగా మూడేళ్ళు గడవగానే బ్రహ్మ సాక్షాత్కారం అయింది. ఇంత త్వరలో సాక్షాత్కారం కలిగినందుకు గోవిందుడు ఆశ్చర్యపోయాడు.

''నరుడా! ఏమిటి నీ కోరిక?'' అన్నాడు బ్రహ్మదేవుడు అలవాటు ప్రకారం.

''కోరిక మాట అలా వుంచు, అదేమిటి అప్పుడే ప్రత్యక్షం అయ్యావు. నేను తపస్సు మొదలుపెట్టి యింకా ముష్టి మూడేళ్ళయినా కాలేదే! మరి పూర్వకాలంలో తపస్సు చేసే వాళ్ళ చుట్టూ పుట్టలు కట్టాలి, గడ్డాలు మీసాలు పెరిగిపోవాలి, ఆ శక్తితో ఇంద్రుడు భయపడి రంభను పంపాలి, రంభ కూడా ఓడిపోయి తరువాత, ఆ తపాగ్ని ముల్లోకాలనూ దహిస్తుంటే అప్పుడు కదా ప్రత్యక్షం అవ్వాలి'' అన్నాడు గోవిందుడు.

''అవునయ్యా! అది కృత, త్రేతా, ద్వాపర యుగాల విషయం. ఆ యుగాల్లో తాపసులకు అంతటి పట్టుదల దీక్ష వుండేవి. తపస్సు చేస్తున్న దేవుడు ప్రత్యక్షం కాకపోతే ఎన్ని యుగాలయినా చెదలు పట్టినా, పాములు పాకినా తపస్సు సాగించేవారు.

మరి ఈ కాలం అంటావా! కలియుగం ఓ పక్క నుంచి దైవభక్తి నశించిపోతుంది. తపస్సులమాట అలా వుంచి, మమ్మల్ని తలచుకునే నాథుడే దొరక్కుండా పోయాడు. ఎవరైనా తలచుకున్నా మేం కనిపించగానే, ''అసలు నువ్వు నిజంగా దేవుడేనా? ఏ సినిమాలోంచో, నాటకంలోంచో ఆ దుస్తులతో పారిపోయొచ్చావా'' అంటున్నారు.

''అందుకని మేం దేవుళ్ళందరూ కలిసి ఓ నిర్ణయం తీసుకున్నాం. ఎవరన్నా తపస్సు అంటూ మొదలుపెట్టగానే నేను అంటే బ్రహ్మ అయితే మూడేళ్ళకి, విష్ణువు అయితే అయిదేళ్ళకి, శివుడయితే ఏడేళ్ళకల్లా దర్శనం యివ్వాలని నిర్ణయించుకుని మధ్యలో రంభని, ఊర్వశిని పంపి తపోభంగం కలిగించవద్దని ఇంద్రుడికీ చెప్పాం. తపస్సు చేస్తున్న వారి జాబితా ఎప్పటికప్పుడు త్రిమూర్తులకు అందించమని నారదమునికి ఆదేశాలిచ్చాం.''

''ఎందుకు....'' ఎంతో ఆత్రంగా అడిగాడు గోవిందుడు.

''ఎందుకంటా ఏమిటయ్యా! ఆలశ్యం చేశామనుకో, భూలోకంలో మాకున్న కాస్త పేరు పడిపోతుంది. ఇంకా తరువాత గుడి గోపురాలకి విలువ లేకుండా పోతుంది. భక్తులు వుంటేనే, గుళ్ళు వుంటాయి, దేవుళ్ళు బ్రతుకుతారు. అందుకే ఎక్కువ శ్రమ పెట్టకుండా త్వరగా ప్రత్యక్షం అవ్వాలని నిర్ణయించుకున్నాం. ఇంతకీ నీకే వరం కావాలో కోరుకో.''

''వరాలు కోరికాదు బ్రహ్మయ్యా! నేను తపస్సు చేసేది.''

''మరింకెందుకు?'' ఆశ్చర్యపోయాడు బ్రహ్మదేవుడు.

''నాకో అనుమానం వుంది, అది నివృత్తి చేసుకోవాలని.''

''ఏమిటది త్వరగా చెప్పు, మళ్ళీ నా హంస వాహనానికి తామర తూడులు తినే సమయం దగ్గరపడుతూంది'' అన్నాడు కాస్త చిరాకుగా బ్రహ్మదేవుడు.

''తెలుసండి బాబూ, మీ కాలం అమూల్యమైందని తెలుసు. నా అనుమానం ఏమిటంటే, మీరు సర్వ శక్తిసంపన్నులు, సర్వాంతర్యామి, సర్వలోక రక్షకులు కదా, మరి మీ భక్తులకే ఇంత కష్టాలు పెడతారేం? నాస్తికులను, ఆస్తికులను కూడా ఒకే తాటిలో నడుపుతారేం'' అన్నాడు.

''పూర్వ జన్మ సుకృతం బిడ్డా! అది తీరితేగాని ఈ జన్మలో సుఖం దొరకదు. చేసుకున్న వారికి చేసుకున్నంత మహదేవా! ఆ పాప పరిహారం అయితే గాని సుఖాలు దొరకవు'' అన్నాడు.

''భలేవాడివయ్యా! యీ వేదాంతం చెప్పడానికా నిన్ను యింత కష్టపడి ప్రత్యక్షం చేసుకుంది. ఈ శ్రీరంగనీతులు మా లోకంలో ప్రతి ఒక్కరూ చెప్పేవే! మానవులంతా ఆస్తికులు, నాస్తికులూ మీకు సమానం

అయినప్పుడు నాస్తికులలాగా పూజలు మానెయ్యొచ్చుగా. ఈ తిరకాసు సమాధానం నాకు నచ్చలేదయ్యా. నీ వరాలు, గిరాలు నాకక్కర్లేదు'' అన్నాడు.

బ్రహ్మదేవుడికి గుండె ఆగినంత పనయింది. ఇంకా ఇతనితో మాట్లాడుతూ కూర్చుంటే కాలికేస్తే, వేలికి, వేలికేస్తే కాలికి లాగి తన చేతనే ''నువ్వు చెప్పింది నిజమేనయ్యా, నిజంగానే దేవుడు లేడు'' అని కూడా అనిపించవచ్చు అనుకుంటుండగానే, ''ఏమయ్యా బ్రహ్మయ్య! మాట్లాడవేమయ్యా'' అని గోవిందుడు గర్జించేసరికి తారెత్తి బ్రహ్మదేవుడు అదృశ్యుడైపోయాడు.

అందుకే అన్నారు పెద్దలు - మొండివాడ్ని దేవుడు కూడా మార్చలేడని.

(ఇది కేవలం వ్యంగ్య రచన. అంతేగాని దేవుళ్ళను కించపరచటం రచయిత అభిప్రాయం కాదు)